సాక్షి ములుగు

మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



సమ్మయ్యకు పద్మశ్రీ ప్రదానం

జనగామ జిల్లా దేవరుప్పులకు చెందిన చిందు, యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య సోమవారం రాత్రి ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. ప్రధాని మోదీ అభినందించారు. - దేవరుప్పుల



న్యూస్‌రీల్

సెల్‌ఫోన్ల అప్పగింత



ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరలో భక్తులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సోమవారం తిరిగి వారికి అప్పగించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మేడారం మహాజాతరకు వచ్చి భక్తులు వారి సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి సెల్‌ఫోన్లను ట్రేస్ అవుట్ చేసి రికవరీ చేశారు. నిర్మల్ జిల్లాకు చెందిన ముస్కే దశరథం, మంచిర్యాల జిల్లాకు చెందిన చిన్నోజు పవన్‌కల్యాణ్‌కు సెల్‌ఫోన్లను అప్పగించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈజీఎస్ పథకం కింద చెరువులు, కుంటలలో పూడికతీత పనులు చేపట్టారు. ఈ మేరకు కూలీలు వడదెబ్బ బారిన పడకుండా వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పని ప్రదేశంలో కూలీలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మాస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు బంగారు అరుణ, తదితరులు పాల్గొన్నారు.

బోటు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయాన్ని సందర్శించే పర్యాటకులకు రామప్ప సరస్సులో బోటింగ్ చేయాలనే ఆసక్తి ఉంటుందని బోటు ప్రయాణం చేసేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం ఎస్సై చల్లా రాజు పిలుపునిచ్చారు. సోమవారం రామప్ప సరస్సు వద్ద బోట్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. బోటింగ్ చేసే పర్యాటకులు సేఫ్టీ జాకెట్లు అందించాలని, బోటింగ్ చేసేటప్పుడు పర్యాటకులు సరస్సు నీటిని అందుకునే ప్రయత్నం చేయకుండా నివారించాలన్నారు. జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని వివరించారు. నిబంధనలు పాటించకుండా డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక క్వారీలతో ముంపు

- ఉన్నతాధికారులకు ఇరిగేషన్ శాఖ ఫిర్యాదు



ఏటూరునాగారం: జిల్లాలోని ఇసుక క్వారీల వల్ల సమీప ప్రాంతాలకు ముంపు ఉందని రాష్ట్ర టీఎస్ఎండీసీ ఉన్నతాధికారులకు, ఏటూరునాగారం ఐటీడీఏ టీఎస్ఎండీసీ పీఓకు రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ ఇంజనీరింగ్ చీఫ్ మురళీధర్‌రావు ఫిర్యాదు చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటూరునాగారంలోని ఇసుక క్వారీలతో కరకట్టకు అతి ప్రమాదం ఉందని, గతంలోనే కరకట్ట మట్టి కోతకు గురై డేంజర్ జోన్‌కు వెళ్లి వచ్చామని వివరించినట్లు తెలిపారు. నదీ తీరాల వద్ద ఇసుకను తోడడం వల్ల నష్టం జరుగుతుదని గుర్తించామని ఫిర్యాదులో తెలిపినట్లు పేర్కొన్నారు. వాల్టా చట్టం షరత్ సెక్షన్ 27(రూల్ –23) ప్రకారం ఇసుక తవ్వకాలు చేయరాదని తెలిపారు. జిల్లా అధికారులకు ఈ ఏడాది మార్చి 3వ తేదీన అన్ని ఆధారాలతో కూడిన లేఖలను అందజేశామని తెలిపారు. అంతే కాకుండా జంపన్నవాగులో ఇసుక తవ్వకాల వల్ల వరద ఉధృతి గ్రామం మీదుగా మళ్లిపోయే ప్రమాదం ఉందని కూడా లేఖలో స్పష్టంగా తెలిపినట్లు వివరించారు.

అంతర్‌జిల్లా చెక్‌పోస్టు తనిఖీ



మంగపేట: అంతర్‌జిల్లా చెక్‌పోస్టును ఎస్పీ శబరీశ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద విధినిర్వహణలో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏటూరునాగారం సీఐ రాజు, ఎస్సై రవికుమార్, సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఉన్నారు.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గల్లంతు

- బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్‌ను గెలిపించాలి
- కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు



ఆదివాసీ కళాకారుల కొమ్ము కిరీటాలతో కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు, అభ్యర్థి సీతారాం నాయక్

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ ఒక వర్గానికి ప్రాధాన్యం ఇచ్చి మిగతా వర్గాలను విస్మరించిందని పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి కాంగ్రెస్ గల్లంతవుతుందని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కిరెణ్ రిజిజు అన్నారు. మానుకోట పార్లమెంట్ స్థానంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్‌ను గెలిపించాలని కోరారు. సీతారాం నాయక్ నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో సోమవారం కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు ముఖ్య అతిథిగా ప్రత్యేక హెలికాప్టర్‌లో మానుకోట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియం సమీపానికి చేరుకున్నారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో సభ నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. గత 70 ఏళ్లుగా దేశంలో పరిష్కారం కాని ఎన్నో సమస్యలను మోదీ సర్కార్ పరిష్కరించిందన్నారు. మోదీ అంటే గ్యారంటీ అని, ప్రజలు ఆలోచన చేస్తున్నారని, దేశం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందని, ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తోందన్నారు. ఆదివాసీ, గిరిజన మహిళలను రాష్ట్రపతిని చేసిన ఘనత మోదీ సర్కార్‌కే దక్కుతుందని, ఉద్యోగం, రాజకీయం ఇతర రంగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. సీతారాంను ఎంపీగా గెలిపిస్తే మానుకోటలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో జిల్లా యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. దేశాభివృద్ధి కోసం మూడో సారి మోదీని ప్రధాని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్, మాజీ రాజ్యసభ, బీజేపీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



50వేల మెజార్టీతో విజయం

- కడియం శ్రీహరికి నేనే రాజకీయ జీవితం ఇచ్చా
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



మాట్లాడుతున్న ఎర్రబెల్లి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, వినయ్‌భాస్కర్, రాజయ్య

హన్మకొండ/కాళోజీ సెంటర్: బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ సోమవారం నామినేషన్ వేసిన సందర్భంగా హనుమకొండ బాల సముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి ఏకశిల పార్కు వరకు భారీ ర్యాలీ తీశారు. ర్యాలీలో, నామినేషన్ వేసిన అనంతరం విలేకరులతో ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. తాను సర్వే చేయించానని, రంగంలోకి దిగకముందే 50 వేల మెజార్టీతో గెలుస్తాన్నారని ప్రచారం చేపడితే మెజార్టీ మరింత పెరుగుతుందన్నారు. పార్టీ పరంగా లాభం పొంది బయటకు వెళ్లిన నాయకులను తిరిగి చేర్చుకునేది లేదని, ఈవిషయంపై పార్టీ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వద్ద మాట తీసుకున్నానన్నారు. తనను కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారని, వారికి ఎలాంటి ఆధారాలు దొరకడం లేదన్నారు. కడియం శ్రీహరికి తానే రాజకీయ జీవితమిచ్చానన్నారు. రేవంత్‌రెడ్డి బ్రోకర్ అయితే కడియం శ్రీహరి మోసకారి అని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. కేసీఆర్‌ను బ్లాక్ మెయిల్ చేసి బిడ్డకు టికెట్ ఇప్పించి వంచించిన మోసగాడు కడియం శ్రీహరి అని ధ్వజమెత్తారు. శ్రీహరిని చూసి ఊసరవెల్లి సిగ్గుపడుతుందని విమర్శించారు. ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. తాను స్థానికున్నే అని, కడియం కావ్య గుంటూరుకు చెందిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు, వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ బిడ్డగా.. ఆదరించండి

- 35 ఏళ్ల తరువాత మహిళకు అవకాశం
- కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ కడియం కావ్య, చిత్రంలో సాంబయ్య, ఎమ్మెల్యేలు

కాళోజీ సెంటర్: '35 ఏళ్ల తర్వాత వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా మహిళకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చింది. మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించి గెలిపించాలి' అని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్యకు తన నామినేషన్ సెట్ పత్రాన్ని దాఖలు చేశారు. అనంతరం కావ్య మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా మహిళా ఓటర్లున్నారని, గతంలో మహిళల సమస్యల పరిష్కారానికి పని చేశానన్నారు. విద్య, ఆరోగ్యం కోసం అధిక ప్రాధాన్యమిస్తానన్నారు. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలైన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ అప్ గ్రేడ్, లెదర్ పార్క్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. ఎడ్యుకేషన్, ఐటీ హబ్‌గా, అండర్ డ్రెయినేజీ వ్యవస్థను తీర్చిదిద్దడానికి పని చేస్తానని హామీ ఇచ్చారు. ఇతర పార్టీల నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ.. రాజ్యాంగాన్ని మార్చాలంటున్నారు.. వారి మాటలు నమ్మకుండా తన గెలుపు కోసం అందరు సహకరించాలని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కావ్య కోరారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, సీనియర్ నాయకుడు దొమ్మటి సాంబయ్య మాట్లాడుతూ.. కులాలు, మతాల పేరుతో నిరుద్యోగులు, రైతులను పొట్టన పెట్టుకున్న పార్టీ బీజేపీ అన్నారు. 120 రోజుల తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు నిందలు మోపుతూ 10 ఏళ్ల పాలనలో అన్ని రకాలుగా ప్రజలను, నిరుద్యోగ యువతను మోసం చేసింది మర్చిపోయారా అని ప్రశ్నించారు. అన్ని రకాల ప్రజలకు మేలు జరగాలంటే.. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సీనియర్ నాయకుడు ఈవీ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరికోతలు

వర్షాల భయంతో అన్నదాతల ఆందోళన

- ముందస్తు కోతలకు మొగ్గు
- ధాన్యం కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు నిల్



వరిపంటను కోస్తున్న హార్వెస్టర్

వెంకటాపురం(ఎం): అకాల వర్షాల భయంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది యాసంగిలో అకాల వర్షాలు, వడగాళ్ల వాన కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాలుగు రోజులుగా వాతావరణంలో మార్పులు వస్తుండడంతో మళ్లీ వడగళ్ల వాన పడుతుందోనని అన్నదాతలు ముందస్తు కోతలకు మొగ్గు చూపుతున్నారు. వరిపంట ఆరకుండానే హార్వెస్టర్ల సహాయంతో వరికోతలు చేపడుతున్నారు. ధాన్యాన్ని ఎలాగైనా ఆరబెట్టుకోవచ్చని అకాల వర్షాలతో ఇబ్బందులు తలెత్తకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని వరికోతలు చేపడుతున్నారు.

50,175 ఎకరాల్లో వరిపంట సాగు

జిల్లాలోని 9 మండలాల పరిధిలో 50,175 ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేశారు. వర్షాలు లేక బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటి పలుచోట్ల వరిపంటలు ఎండిపోయిన సంఘటనలు ఉన్నాయి. జిల్లాలో రామప్ప సరస్సు లక్నవరం, మల్లూరు ప్రాజెక్టుతో పాటు కొన్ని చెరువుల కింద వరిపంటలు సాగునీటికి కొదవలేకుండా పంటలు చేతికొస్తున్నాయి. అకాల వర్షాలతో పంటలు నేలపాలు కాకుడదని రైతులు ముందస్తు కోతలు చేపట్టి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తున్నారు.



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలిస్తున్న రైతు



వెంకటాపురం(ఎం)లో ఆరబోసిన ధాన్యం

144 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా 144 ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభించారు. ఈ యాసంగి నుంచి ఐరిష్ కొత్త విధానాన్ని తీసుకరావడంతో పాటు రైస్‌మిల్లుల కేటాయింపు, గన్నీ సంచులను కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయడంలో జాప్యం జరుగుతుండడంతో అధికారులు కొనుగోళ్లు ఇంకా ప్రారంభించలేదు. ఆకాశంలో వస్తున్న మార్పులతో కొనుగోలు కేంద్రాల వద్ద పగలంతా ధాన్యాన్ని ఆరబోయటం, సాయంత్రమైతే కుప్ప చేసేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

వరుస సభలు.. ప్రచార హోరు!



అగ్రనేతల ఆగమనం.. ఊపందుకున్న ప్రచారం

- ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా నేతలు...
- నేడు వరంగల్‌లో కేటీఆర్ సభ.. రేపు సీఎం రేవంత్ రెడ్డి రాక
- మరోవైపు బీజేపీ కేంద్రమంత్రులు.. పోటాపోటీగా అగ్రనేతల సభలు

సాక్షిప్రతినిధి, వరంగల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ రాజకీయ పార్టీల పోరుగల్లుగా మారింది. నామినేషన్ల ఘట్టం 25న ముగియనుండగా.. అప్పుడే పార్లమెంట్ స్థానాల పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీల అగ్రనేతల ప్రచార సభలు హోరెత్తుతున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన అగ్రనేతలు.. అభ్యర్థుల గెలుపు కోసం సర్వశక్తులొడ్డేందుకు రోడ్‌షోలు, బహిరంగ సభల షెడ్యూల్‌లను ప్రకటించారు. ఇప్పటికే విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గెలుపే లక్ష్యంగా ఓవైపు అభ్యర్థులు నిత్యం నియోజకవర్గాల్లో అలుపెరగకుండా తిరుగుతుండగా.. మరోవైపు జోష్ పెంచేందుకు అగ్రనేతలతో బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు.

నామినేషన్ల నుంచే మొదలైన ప్రచారం...

ఈ నెల 18న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా.. ఆ మరుసటి రోజు నుంచే అగ్రనేతల ప్రచార సభలు మొదలయ్యాయి. 19న మహబూబాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ నామినేషన్ సందర్భంగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి.. ఉమ్మడి వరంగల్‌లో ఎన్నికల శంఖారావం పూరించారు. బీజేపీ, బీఆర్ఎస్ అగ్రనేతల షెడ్యూల్ కూడా మానుకోటలో ఖరారయ్యింది. మే 1న మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మానుకోటలో రోడ్‌షో నిర్వహించనున్నారని ఆ పార్టీ ప్రకటించింది. బీజేపీ తరఫున కేంద్రమంత్రి అమిత్‌షా పాల్గొననున్నట్లు వెల్లడించారు. అలాగే వరంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి డా.ఎం.సుధీర్‌కుమార్ తరఫున ప్రచారం నిర్వహించేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేడు (మంగళవారం) వరంగల్‌లో పర్యటించనున్నారు. ఆ మరుసటి రోజు, ఈ నెల 24న సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య తరఫున ప్రచారం చేసేందుకు వరంగల్‌కు రానున్నారు. 28న కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, అమిత్‌షాలు బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కోసం రోడ్ షో, సభలు నిర్వహించనున్నట్లు పార్టీవర్గాలు ప్రకటించాయి. కాగా 25న నామినేషన్ల పర్వం ముగియనుండగా 29న ఉపసంహరణ అనంతరం గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పత్రాలు విడుదల కానున్నాయి. ఆ తర్వాత సుమారు 14 రోజులు ప్రచారం నిర్వహించే అవకాశం ఉండగా.. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు, బీజేపీ తరఫున పీఎం నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, అశ్విన్ వైష్ణవ్, సీఎం ఆదిత్యనాథ్ యోగి తదితరులు, బీఆర్ఎస్ నుంచి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, తదితరులు ప్రచారాన్ని హోరెత్తించనున్నారని ఆయా పార్టీలు ప్రకటించాయి.

నేడు వరంగల్‌కు కేటీఆర్.. టూర్ షెడ్యూల్ ఇదీ..

వరంగల్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్ తరఫున ప్రచారం నిర్వహించేందుకు మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) మంగళవారం వరంగల్‌లో పర్యటించనున్నారు. అలంపూర్ నుంచి హెలికాప్టర్ ద్వారా సాయంత్రం 4.30 గంటలకు సుబేదారి పరిధిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానానికి చేరుకోనున్న కేటీఆర్.. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో హంటర్‌రోడ్డులోని డి–కన్వెన్షన్‌కు వెళ్తారు. అక్కడ ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం ఉర్సు గుట్టలోని నాని గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో పాల్గొని.. అక్కడినుంచి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వెళ్తారు.

నామినేషన్ల సందడి

- దాఖలు చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- వరంగల్ పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు
- మహబూబాబాద్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ దాఖలు..
- తొలిసెట్ సమర్పించిన సుధీర్ కుమార్, కడియం కావ్య

- వివరాలు 8లో▸

వినతులు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ములుగు: ప్రజావాణిలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ వినతులు స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన 18మంది నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు ఫార్వర్డ్ చేశారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ, ఇన్‌చార్జ్ డీపీఓ శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య, సివిల్ సప్లయీస్ డీఎం రాంపతి, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చందర్, డీఈఓ పాణిని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలి

ములుగు: ఇంటర్ మొదటి, రెండో సంవత్సర పరీక్షల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పాస్, ఫెయిల్ అయినా విద్యార్థులు టెన్షన్‌కు గురికాకుండా మానసిక ఒత్తిడిని జయించాలని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. పరీక్షలో ఫెయిల్ అయితే మళ్లీ రాసి ఉత్తీర్ణత సాధించవచ్చని తెలిపారు. చిన్న చిన్న విషయాలను లోతుగా ఆలోచించి ఆత్మహత్యలకు పాల్పడవద్దని పేర్కొన్నారు. ఎవరైనా మానసిన ఒత్తిడికి గురి అయితే 14416 టెలీ మానస కాల్‌సెంటర్‌కు ఫోన్‌చేసి సేవలను ఉపయోగించుకోవచ్చని సూచించారు. జిల్లా ఆస్పత్రిలోనూ ప్రత్యేక మానసిక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని వివరించారు. తల్లిదండ్రులు సైతం తమతమ పిల్లలను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు.

కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు..

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

ములుగు: ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లోనే ముప్పతిప్పలు పెట్టిందని అలాంటి పార్టీకి ఓట్లు అడిగే హక్కులేదని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని సోమవారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించగా సత్యవతిరాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మితే నట్టేటముంచిందన్నారు. రాష్ట్రంలో కరువురావడానికి కాంగ్రెస్ కారణం అన్నారు. రెండు లక్షల రుణమాఫీ పేరుతో రైతులను, రూ.2,500 ఇస్తామని మహిళలను, 4వేల పింఛన్ ఇస్తామని వృద్ధులు, వితంతువులను మోసం చేసిందన్నారు. ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ములుగు జిల్లా ఏర్పడిందని, జిల్లా ఆస్పత్రితో పాటు మెడికల్ కళాశాల మంజూరు అయ్యిందని వివరించారు. వందల కోట్ల నిధులతో బీఆర్ఎస్ ములుగును అభివృద్ధి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, పోరిక గోవింద్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, వేములపల్లి భిక్షపతి, తుమ్మ మల్లారెడ్డి, కృష్ణ, అశోక్, సురేందర్, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గట్టమ్మతల్లికి పూజలు

ములుగు రూరల్: మండలంలోని గట్టమ్మ తల్లిని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ దర్శించుకున్నారు. ఈ మేరకు సోమవారం బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ క్రమంలో సత్యవతి తొలుత గట్టమ్మ తల్లికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం సమావేశానికి హాజరయ్యారు.



రేపు దేవుడి మాన్యం వేలంపాట

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీఉమా రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన దేవుడి మాన్యం(భూమి) కౌలు వేలం పాట రేపు(24న) బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటను బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు వేలం పాటలో పాల్గొని దేవుడి మాన్యం(భూమి) కౌలుకు పొందాలని సూచించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ అనుమతితో ఈ వేలం పాటను నిర్వహించనున్నట్లు వివరించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ షెడ్యూల్ ఖరారు



కాజీపేట : ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి షెడ్యూల్ ఖరారైంది. వీరికి మే 5 నుంచి 7వ తేదీ వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. 5న పీఓలు, ఏపీఓలు, సూక్ష్మ పరిశీలకులుగా విధులు నిర్వహించే వారు.. వారు పనిచేసే నియోజకవర్గ కేంద్రాల్లో ఓటు వేసేలా ఏర్పాట్లు చేశారు. 6న ఏపీఓలు, 7న పోలీసు, ఎన్నికల విధులు నిర్వహించే ఇతర శాఖల ఉద్యోగులు ఓటు వేయాలని నిర్ణయించారు. ఇతర జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



బోండా.. రండా.. మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ సోమవారం నామినేషన్ దాఖలు సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సమయంలో ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందడానికి కొబ్బరి బోండా తాగుతున్న కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024



అన్నా.. కండువా కప్పుకో..

వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సమయంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పార్టీ కండువా కప్పుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, డీసీసీ హనుమకొండ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి.

నగరంలో వాహనాల తనిఖీ

- రూ.3.39 లక్షలు స్వాధీనం



బ్యాగు తనిఖీ చేస్తున్న పోలీసులు

రామన్నపేట : వరంగల్ ఏసీపీ బి.నందిరాం ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని పోచమ్మ మైదాన్ ప్రాంతంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో ఆధారాలు లేకుండా తరలిస్తున్న వరంగల్ బ్యాంక్ కాలనీకి చెందిన కేదియా ప్రతీక్ నుంచి రూ. 2.73 లక్షలు, తాటికొండ రవికాంత్ నుంచి రూ.66 వేలు.. మొత్తం రూ.3.39 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకుని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జ్‌కు అప్పగించారు. ఈ తనిఖీల్లో మట్టెవాడ, మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్లు టి.గోపి, పి.మల్లయ్య, ఎం.శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పదంగా బీఫార్మసీ ప్రాక్టికల్స్!

- పరీక్షలు నిర్వహిస్తుండగా రిజిస్ట్రార్ తనిఖీ
- విద్యార్థుల నుంచి రికార్డులు, ఆన్సర్ బుక్‌లెట్లు తీసుకెళ్లి అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధికకు అప్పగింత

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ మూడో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 18న ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తుండగా రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఆ కళాశాలను సందర్శించారు. ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న ల్యాబ్‌లోనికి వెళ్లి చూడగా పలువురు విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు సంబంధించిన రికార్డులు కలిగి ఉండడాన్ని గమనించి వెంటే ఆయా విద్యార్థుల నుంచి రికార్డులు, ఆన్సర్ షీట్లను తీసుకొని వెళ్లిపోయారు. సుమారు 10మంది విద్యార్థుల రికార్డులను అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధికకు అదే రోజు అప్పగించారు. ఈవిషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రాక్టికల్స్ లో ఇచ్చే ప్రయోగ పరీక్షను పూర్తిచేశాకే అందుకు సంబంధించిన జవాబులను ఆన్సర్ షీట్‌లో రాయాల్సింటుంది. అయితే రికార్డులు విద్యార్థులు దగ్గర ఉండడంతో ప్రాక్టికల్స్ చేయకుండానే రికార్డులు చూసి రాస్తున్నారా అనే అనుమానంతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఆయా విద్యార్థుల నుంచి ప్రాక్టికల్స్ రికార్డులు, ఆన్సర్ బుక్‌లెట్లు తీసుకెళ్లారు. దీంతో ఆయా విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలు ఆరోజు నిలిచిపోయాయి.

ప్రాక్టికల్స్ పరీక్ష రద్దు: మళ్లీ ప్రైవేట్ కాలేజీలో నిర్వహణ

ఈనెల 18న జరిగిన ఒక బ్యాచ్ మొత్తం విద్యార్థుల ప్రాక్టికల్స్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డాక్టర్ రాధిక నిర్ణయించారు. అయితే ప్రాక్టికల్స్ పరీక్షను సోమవారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫార్మసీ కళాశాలలో సెంటర్‌లో నిర్వహించడం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. బ్యాచ్ మొత్తం 31మంది విద్యార్థులు ఉండగా అందులో ఎవరివైతే ప్రాక్టికల్స్ రికార్డులు, బుక్‌లెట్లు తీసుకెళ్లారో ఆయా విద్యార్థులకే ఈ ప్రాక్టికల్స్ పరీక్షను మళ్లీ నిర్వహించారని సమాచారం. అయితే కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధికను వివరణ కోరగా ఈనెల 18న బీఫార్మసీ మూడో సెమిస్టర్ పరీక్షలను హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సోమవారం నిర్వహించామని వివరణ ఇచ్చారు. కాగా తాను ఆ బ్యాచ్ మొత్తం విద్యార్థులకు పరీక్ష నిర్వహించాలని చెప్పామని కేవలం 10మందికే ప్రాక్టికల్స్ పరీక్షకు తీసుకెళ్లి నిర్వహించారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఆ బ్యాచ్‌లో ఎంతమంది ఉంటే అందరికీ ప్రాక్టికల్స్ నిర్వహించాలని సోమవారం మళ్లీ యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ సంబంధిత అధ్యాపకుడిని ఆదేశించామని తెలిపారు. ఈ విషయంపై పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

వడదెబ్బతో బీఆర్ఎస్ నాయకుడి మృతి



కొమురయ్య(ఫైల్)

గార్ల: వడదెబ్బతో గార్లకు చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు మోడెం కొమురయ్య(67) మృతిచెందారు. ఆదివారం మధ్యాహ్నం గార్లలో ఓ శుభకార్యానికి వెళ్లగా అక్కడ వడదెబ్బ తగలింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. సోమవారం తెల్లవారుజామున మార్నింగ్ వాక్‌కు వెళ్లి వచ్చి ఇంట్లోనే మృతి చెందాడు. కాగా, కొమురయ్య మృతదేహాన్ని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, పి రాధాకృష్ణ, టీపీసీసీ సభ్యుడు రావూరి వెంకట్రామయ్య, తాళ్లపల్లి కృష్ణగౌడ్, శంషాద్‌బేగం, కందునూరి శ్రీనివాసరావు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పలిమెలలో మహిళ..

పలిమెల : వడదెబ్బతో మండల కేంద్రానికి చెందిన కుమ్మరి అనిత (45) మృతి చెందింది. వారం రోజుల నుంచి కూలీ పనికి వెళ్లిన అనిత.. వడదెబ్బకు గురైంది. తీవ్ర అస్వస్థతతో ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త తిరుపతి ఉన్నారు. మృతురాలి అత్త చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

నామినేషన్ల సందడి..



నామినేషన్ వేస్తున్న బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్, చిత్రంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సారయ్య



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, చిత్రంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కే.ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, దొమ్మాటి సాంబయ్య



మహబూబాబాద్ : నామినేషన్ వేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్, చిత్రంలో గంట రవికుమార్, యలమంచిలి వెంకటేశ్వర్‌రావు తదితరులు

దాఖలు చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

- వరంగల్ పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు
- మహబూబాబాద్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ దాఖలు..
- తొలిసెట్ సమర్పించిన సుధీర్ కుమార్, కడియం కావ్య
- నేతలతో కలిసి కలెక్టర్‌కు సమర్పణ

సాక్షి, వరంగల్/మహబూబాబాద్: వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల్లో నామినేషన్ల సందడి నెలకొంది. ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. వరంగల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు డాక్టర్ కడియం కావ్య, ఆయుర్వేదిక్ వైద్యుడు మారేపల్లి సుధీర్ కుమార్‌తో పాటు మరో ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో హనుమకొండలోని వరంగల్ కలెక్టరేట్ (రిటర్నింగ్ అధికారి కార్యాలయం) వద్ద వివిధ రాజకీయ పార్టీ నేతల సందడి కనిపించింది. తొలుత బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సుధీర్ కుమార్ బాలసముద్రం ఏకశిలా పార్క్ వద్దకు ర్యాలీగా వచ్చిన అనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆ పార్టీ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, సీనియర్ నాయకుడు దొమ్మాటి సాంబయ్యతో కలిసి తన నామినేషన్ పత్రం కలెక్టర్ ప్రావీణ్యకు సమర్పించారు. గంటల వ్యవధిలోనే వీరిద్దరూ నామినేషన్లు సమర్పించారు. ఉదయం 11.40 గంటల సమయంలో సుధీర్ కుమార్, మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో కడియం కావ్య తమ తొలిసెట్ నామినేషన్లు దాఖలు చేశారు. కాగా, నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన మొదటి, రెండో , మూడో, నాలుగో రోజు కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 19మంది అభ్యర్థులు 22 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య తెలిపారు. వీరిలో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మేకల సుమన్ మరో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు.

నామినేషన్ల కోలాహలం..

- పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా మారేపల్లి సుధీర్ కుమార్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు ఒక సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు.
- కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య కూడా ఒక సెట్ నామినేషన్ పత్రం సమర్పించారు.
- స్వతంత్ర అభ్యర్థులుగా తాళ్లపల్లి వెంకటయ్య, మందా నరేష్, బొచు రాజు, శనిగరపు రమేష్ , పొంగుల అశోక్ ఒక సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు.
- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా ఇసంపల్లి వేణు ఒక సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు.
- ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మేకల సుమన్ మరో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు
- విదు థలై చిరు థైగల్ కాచి పార్టీ అభ్యర్థిగా మచ్చ దేవేందర్ ఒక సెట్ నామినేషన్ వేశారు.

మానుకోటలో మూడు నామినేషన్లు..

మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి సోమవారం మూడు నామినేషన్‌లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్వో, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అభ్యర్థులు నామినేషన్‌పత్రాలు అందజేశారు. ములుగు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్..బీజేపీ తరపున నామినేషన్‌లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పాల్వంచ దుర్గ రెండో సెట్ నామినేషన్ వేశారు. ఈనెల 19న మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. యూసీసీఆర్ఐఎంఎల్ పార్టీకి చెందిన పగిడి ఎర్రయ్య నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్ నామినేషన్ వేశారు. ఈనెల 18న ఒక్క నామినేషన్, 19న నాలుగు, , 20న నామినేషన్‌లు దాఖలు కాలేదు. ఈనెల 21న ఆదివారం సెలవు కావడంతో ఈనెల 22న (సోమవారం) మూడు నామినేషన్‌లు దాఖలయ్యాయని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు స్వతంత్ర అభ్యర్థి దుర్గ, కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 8 నామినేషన్లు 10 సెట్లు దాఖలయ్యాయి.



వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ నేతలు ఎర్రబెల్లి, వినయ్‌భాస్కర్ తదితరులు



మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, కళాకారులు

జనజాతర సభను విజయవంతం చేయాలి

- వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి తదితరులు

మడికొండ : కాజీపేట మండలం మడికొండలో ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న ఓరుగల్లు జన జాతర సభను విజయవంతం చేయాలని వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కే.ఆర్.నాగరాజు, కడియం శ్రీహరితో కలిసి మడికొండలో సభ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ 24వ తేదీన వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అనంతరం మడికొండలో సాయంత్రం 3 గంటలకు ఓరుగల్లు జన జాతర సభలో పాల్గొని, మాట్లాడుతారన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందని విమర్శించారు. కార్యక్రమంలో డీసీసీ వరంగల్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా అధికార ప్రతినిధి కూచన రవళి, నేతలు కత్తి వెంకటస్వామి, ఎం.పి ఆనంద్, స్థానిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గద్దం అమర్‌నాథ్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కుర్ల మోహన్, వస్కుల శంకర్, పల్లపు రాజేందర్, ఎడబోయిన ప్రభాకర్ పాల్గొన్నారు.

నామినేషన్‌కు భారీగా తరలిరావాలి

- బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి




మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్

హన్మకొండ: వరంగల్ పార్లమెంట్ స్థానానికి ఈ నెల 25న దాఖలు చేయనున్న నామినేషన్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలిరావాలని బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి రానున్నారన్నారు. మండలాల వారీగా సమావేశాలు నిర్వహించుకుని నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలన్నారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో.. పాలన చేత కాక చేతులు ఎత్తేసిందని విమర్శించారు. మోదీ పాలననే దేశ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి, వర్ధన్నపేట అసెంబ్లీ కన్వీనర్ కేశవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

- రూ.2 లక్షల నగదు..ద్విచక్ర వాహనం స్వాధీనం



రివార్డు అందజేస్తున్న డీసీపీ, ఏసీపీ

జనగామ రూరల్ : వివిధ చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.2లక్షల నగదు.. ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. డీసీపీ సీతారాం, ఏసీపీ అకింత్ కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. కర్నాటక రాష్ట్రంలోని శివమొగ్గ జిల్లా భద్రావతి పట్టణానికి చెందిన హరీష్ కార్ షాప్‌లో స్టిక్కరింగ్ పని చేస్తుంటాడు. కాగా జీతం సరిపోక జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే 2022 డిసెంబర్‌లో నిజామాబాద్ జిల్లా కేశావాపూర్ వద్ద కారులో ఉన్న రూ.13.3 లక్షలు, 2023లో ఏపీలోని కర్నూలు జిల్లా ఎమ్మిగనూర్‌లో బైక్ పై వస్తున్న వ్యక్తి నుంచి రూ.3.5 లక్షలు అపహరించాడు. అలాగే, సత్యసాయి జిల్లా కదిరిలో ఎస్‌బీఐ వద్ద పార్క్ చేసిన టీవీఎస్ స్కూటీలో రూ.17లక్షలు చోరీ చేసి తన మిత్రుడు నిఖిలేష్‌తో పంచుకున్నాడు. మార్చి చివరి వారంలో జడ్చర్లలో స్కూటీలో ఉన్న రూ.47 వేలు చోరీ చేసి యాదగిరిగుట్టలో ఖర్చు చేశారు. అదే రోజు జనగామకు వచ్చి ఐసీఐసీఐ వద్ద ఓ వ్యక్తి డ్రా చేసి తన కారులో డ్రైవర్ సీటు కింద పెట్టుకున్నాడు. గమనించిన దుండగులు కారు కింద ఆయిల్ లీకేజీ అవుతుందని చెప్పగా పరిశీలించారు. అప్పుడు చోరీ చేయడానికి వీలుకాలేదు. అనంతరం ఐడీబీఐ బ్యాంక్ వద్ద కారు ఆపి పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు వెళ్లగానే కారు అద్దాలు పగులగొట్టి రూ.2లక్షలు అపహరించారు. అక్కడ నుంచి మైసూర్ వెళ్లిపోయారు. మళ్లీ జనగామలో చోరీ చేయడానికి రాగా కళ్లెం కమాన్ వద్ద వాహనాల తనిఖీ చేయగా పోలీసులను చూసిన వారు పారిపోతుండగా నిందితుడి పట్టుకున్నారు. కాగా, నిందితుడు గతంలో కూడా మహారాష్ట్రలోని పూణె, ముంబాయి, నాగ్‌పూర్‌లో ఇతర వ్యక్తులతో కలిసి చోరీ చేసి నాగ్‌పూర్ జైలుకు సైతం పోయివచ్చాడని డీసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ఉమ్మడి ఆపరేషన్ చేసిన సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై ఎం.భరత్, కానిస్టేబుళ్లు కరుణాకర్, అనిల్ కుమార్, రామన్న, సాగర్, సురేష్, ఏఎస్సై శ్రీనివాస్‌రాజు, వంశీ విశ్వేశ్వర్, సాల్మన్, నాగేష్, ప్రవీణ్‌ను డీసీపీ సీతారాం అభినందించారు.

విద్యుత్ భద్రతాప్రమాణాలు పాటించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ : ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతాప్రమాణాలు పాటించాలని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి తల్లాడ సబ్‌స్టేషన్‌లో ప్రమాదవశాత్తు సిటీ పేలడంపై సీఎండీ స్పందించారు. పనిచేసే ప్రదేశంలో సేఫ్టీ గ్లౌజ్‌లు, హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. ఒకవేళ ధరించకుండా నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. భద్రత జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలు కోల్పోవల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లాడ సబ్ స్టేషన్‌లో అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్ (ప్రొటెక్షన్) సమక్షంలో లైన్‌మన్ సిటీ వివరాలు నమోదు చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లినప్పుడు భద్రత నియమాలు పాటించాలని చెప్పకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని, సంబంధిత అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అత్తారింటికి వస్తూ.. అనంతలోకాలకు..

- గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి
- గవిచర్ల సమీపంలో ఘటన



నవీన్(ఫైల్)

సంగెం: అత్తారింటికి వస్తున్న ఓ యువకుడు గుర్తుతెలియని వాహనం ఢీకొని అనంతలోకాలకు(దుర్మరణం) వెళ్లాడు. ఈ విషాద ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన బదలగాని నవీన్(28)కు వరంగల్ జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామానికి చెందిన ప్రియాంకతో నాలుగున్నర ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కూతురు ఆద్యశ్రీ, మూడు నెలల బాబు ఉన్నాడు. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న నవీన్.. అత్తారింటిలో ఉన్న భార్యాపిల్లలను చూడడానికి ఆదివారం రాత్రి స్నేహితుడి ద్విచక్రవాహనంపై తీగరాజుపల్లికి వస్తున్నాడు. మరికాసేపట్లో అత్తారింటికి చేరుకునే క్రమంలో గవిచర్ల సమీపంలో కట్టుకాలువ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆపకుండా వెళ్లింది. ఈ ఘటనలో నవీన్‌కు తీవ్ర గాయాలై పడి ఉండగా తీగరాజుపల్లి గ్రామానికి చెందిన జుర్రు ప్రశాంత్, అల్లితిమ్మాపూర్‌కు చెందిన కొంగ ప్రవీణ్ చూసి సంగెం జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డికి సమాచారం అందించారు. జెడ్పీటీసీ సమాచారం మేరకు మృతుడి భార్య ప్రియాంక.. తండ్రి కేర్ల నగేష్‌తో కలిసి ఘటనాస్థలికి చేరుకుని తీవ్ర గాయాలైన నవీన్‌ను 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్. నరేష్ పేర్కొన్నారు.

యువతి పెళ్లికి.. ఊరంతా బంధువులే

- తల్లిదండ్రులను కోల్పోయిన యువతి వివాహానికి గ్రామస్తుల సాయం
- దాతలు సహకరించాలని వేడుకోలు

కొత్తగూడ: తల్లిదండ్రులను కోల్పోయిన యువతి వివాహానికి.. గ్రామస్తులు బంధువులుగా మారారు. తమకు తోచిన మేర సాయం చేస్తున్నారు. మరింత మంది సాయం చేసి ఆమెకు నూతన జీవితం అందించాలని కోరుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన తాటికాయల కోటి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో పాటలు పాడుతూ ప్రజలను చైతన్యం చేశాడు. ఆరేళ్ల క్రితం కోటి, అతడి భార్య సునీత అనారోగ్యంతో మృతి చెందారు. వారికి కుమార్తె సుప్రజ, కుమారుడు సుమంత్ ఉన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ విద్యాభ్యాసం చేశారు. సెలవుల సమయంలో నానమ్మ సారమ్మ వద్ద, బంధువుల ఇళ్లల్లో ఉండేవారు. అయితే నానమ్మ సారమ్మకు ఎలాంటి ఆస్తి లేదు. దీంతో సుప్రజకు హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన యువకుడితో ఈనెల 25న వివాహం చేయడానికి గ్రామస్తులు నిశ్చయించారు. ఈ వివాహానికి దాతల సహకారం కోరడంతో చాలా మంది ముందుకు వచ్చి తమకు తోచిన సాయం అందిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.70వేలు వచ్చినట్లు నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న ఇస్సాక్ తెలిపారు. ఇంకా దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు.

సాయం అందించేవారు 95508 05323 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బు పంపాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.